
# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 18 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 28 ఏప్రిల్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

## అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

### గుజరాత్‌కు చెందిన ముగ్గురు మహిళలు మృతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం): అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో గుజరాత్‌కు చెందిన ముగ్గురు మహిళలు మృతి చెందారు. వీరి కారు సౌత్ కరోలినాలోని గ్రీన్‌విల్లే కౌంటీలోని బ్రిడ్జ్ మీదకు రాగానే అదుపు తప్పి బ్రిడ్జి మీద నుంచి 20 అడుగుల పైకి ఎగిరి ఎదురుగా ఉన్న చెట్లను ఢకొ?ట్టిడంతో ఈ ప్రమాదం జరిగినట్లు చీఫ్ డిప్యూటీ కరోనర్ మైక్ ఎల్లిస్ మీడియాకు వెల్లడించారు. ఈ ఘటనలో గుజరాత్‌లోని ఆనంద్ జిల్లాకు చెందినటువంటి రేఖాబెన్ పటేల్, సంగీతాబెన్ పటేల్, మనీషాబెన్ పటేల్ మృతి చెందారని.. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

# సోషల్ మీడియాలోకి కేసీఆర్



### తింటుంటే రెండుసార్లు కరెంట్ పోయిందని ట్వీట్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సోషల్ మీడియాలోకి ప్రవేశించారు. శనివారమే ఎక్స్ ఖాతా తెరిచిన కేసీఆర్.. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను ప్రస్తావిస్తూ ట్వీట్లు చేస్తున్నారు. మహబూబ్ నగర్ పర్యటనలో ఉన్న కేసీఆర్ కరెంట్ కోతలపై ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చాలా చిత్రవిచిత్రమైన సంఘటనలు జరుగుతున్నాయి. నేను గంట క్రితం మహబూబ్ నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు రెండుసార్లు కరెంటు పోయింది. ప్రతిరోజు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కరెంటు పోవడం లేదని ఊదరగొడుతున్నారు. నాతోపాటు ఉన్న మాజీ ఎమ్మెల్యేలు వారి వారి నియోజకవర్గాల్లో రోజుకు పదిసార్లు కరెంటు పోతున్నదని ఈ సందర్భంగా నాకు చెప్పారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ పరిపాలనా వైఫల్యానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం ఏముంటుంది? రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలి అని కేసీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# ఉగ్రవాదం తుదముట్టించాలి



### మూడోసారి మోడీనే గెలిపించాలి
### పోరుబందర్ ఎన్నికల ప్రచారంలో అమిత్ షా పిలుపు

పోరుబందర్, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం): వరుసగా మూడోసారి నరేంద్ర మోదీని భారత ప్రధానిని చేయాలని దేశ ప్రజలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. శనివారం పోర్ బందరులో బీజేపీ అభ్యర్థి మనుశుక్ మాండవ్యాకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా మాట్లాడారు. ముచ్చటగా మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ అవకాశం ఇస్తే.. ఆయన దేశంలో నక్సలిజానికి, ఉగ్రవాదానికి చరమగీతం పాడతారన్నారు. అయితే కాశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370ని బీజేపీ రద్దు చేసిందని.. అయితే ఆ ఆర్టికల్ రద్దును ..మిగతా 2లో

# రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్రలు

### పూర్తి హిందూరాజ్యంగా మార్చే కుయుక్తులు
### దామాషా ప్రకారం రిజర్వేషన్లు మా సిద్దాంతం
### అందుకే కులగణన చేపట్టాలన్నది కాంగ్రెస్ నిర్ణయం
### 400 సీట్ల లక్ష్యం వెనక రాజ్యాంగం మార్చే కుట్ర
### మీడియా సమావేశంలో సీఎం రేవంత్



హైదరాబాద్, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం): అన్ని కులాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ అజెండా అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో బీసీలు 50శాతానికి పైగా ఉన్నారని, జనగణన చేసి వారికి రిజర్వేషన్లు పెంచుతామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ దేశ రాజకీయాలను, సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ప్రభావితం చేసే అంశంపై విస్పష్టంగా మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుందని అన్నారు. దేశంలో రిజర్వేషన్లు కొనసాగాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. శనివారం జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమంగానో.. దౌర్జన్యంగానో.. 400 సీట్లు సాధించి రాజ్యాంగం ప్రాథమిక సూత్రాలపైనే దాడి చేయాలని మోదీ, అమిత్ షా కంకణ బద్దులై ఉన్నారు. ఇందులో భాగంగానే దేశం నలుమూలలా తిరుగుతూ అన్ని రకాల వ్యవస్థలు, సంస్థల్ని ఉపయోగించుకొని ముప్పేట దాడి చేస్తున్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత భాజపాపై .. కాంగ్రెస్ స్పష్టమైన ఆరోపణలు చేస్తోంది. కాంగ్రెస్ ప్రశ్నలకు ఇప్పటి వరకు నరేంద్రమోదీ, అమిత్ షా, జేపీ నడ్డా సమాధానం చెప్పలేదు. ప్రజాస్వామ్య విలువలు, విధానాలకు విరుద్ధంగా వారు వ్యవహరిస్తున్నారుని రేవంత్ మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్ మనువాద విధానాన్ని అమలు చేయాలని వారిద్దరూ ప్రయత్నిస్తున్నారు. వివిధ కులాలు, వర్గాలు ఉంటే హిందువులు ఏకతాటి మీదకురారు అనేది భాజపా కుట్ర. రిజర్వేషన్లు రద్దు చేస్తే.. వేర్వేరు కులాలు, వర్గాల ప్రస్తావన లేకుండా పోతుందనేది ఆ పార్టీ ఆలోచన. వచ్చే ఏడాదికి ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు అవుతుంది. 2025 నాటికి రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లు రద్దు చేయాలనేది ఆర్ఎస్ఎస్ లక్ష్యం. రాజ్యాంగాన్ని మార్చాలంటే మూడింట రెండొంతుల మెజార్టీ అవసరం. అందుకే 400 సీట్లలో గెలిపించాలని మోదీ పదే పదే కోరుతున్నారు. భారత్‌ను రిజర్వేషన్ రహిత దేశంగా మార్చాలని మోదీ, అమిత్ షా భావిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. రిజర్వేషన్ల రద్దుపై భాజపా, భారాస ఒకే విధానంతో ఉన్నాయి. ఆ రెండు పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయి. మల్కాజిగిరిలో భాజపాను గెలిపిస్తామని నిన్న భారాస ఎమ్మెల్యే మల్లారెడ్డి ..మిగతా 2లో



### తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో
# కీలక పరిణామం

### కాంగ్రెస్‌కు మద్దతుగా సీపీఎం పోటీ నుంచి విరమణ
### బిజెపిని ఢీకొనేందుకు కలసి పోరాడలని నిర్ణయం
### సీఎం రేవంత్‌లో భేటీలో తమ్మినేని సీతారాం చర్చలు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం): తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వాలని సీపీఎం నిర్ణయించుకుంది. సీపీఎం ముఖ్యనేతలతో రేవంత్ రెడ్డి సమావేసి అయ్యారు. పిఎం ముఖ్య నేతలు శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. లోక్‌సభ స్థానాల్లో మద్దతివ్వాలని సిపిఎం నేతలను రేవంత్ రెడ్డి కోరినట్లు సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం తెలిపారు. అభ్యర్థులను విరమించుకోవాలని సీఎం కోరారు.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. బీజేపీ, ఇతర శక్తులు అడ్డుకునేందుకు కాంగ్రెస్ కు మద్దతు ఇవ్వాలని నిర్ణయించు కున్నామని.. ముఖ్యమంత్రితో పాటు ఇతర నాయకులతో చర్చించామన్నారు. భువనగిరి పార్లమెంట్‌తో పాటు ఇతర స్థానాల్లోనూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మరికొన్ని రాజకీయ ప్రతిపాదనలు కూడా వారి ముందు పెట్టామని.. బీజేపీ శక్తులను ఓడించేందుకు కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చేందుకు వారు అంగీకరించారన్నారు. దేశంలోనూ ..మిగతా 2లో



### ప్రజల గొంతుకగా
# మాట్లాడుతూనే ఉంటాం

### భవిష్యత్తులోనూ ప్రజల కోసం కొట్లాడుతాం
### తెలంగాణ భవన్‌లో పార్టీ జెండా ఆవిష్కరణలో కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం): విజయాలకు పొంగిపోము, అపజయాలకు కృంగిపోమనేలా తమ ప్రస్థానం సాగుతుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. భవిష్యత్తులోనూ ప్రజల కోసం మాట్లాడుతూనే ఉ ంటాం.. కొట్లాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. తెలంగాణకు ఒక గొంతుక ఉండటం అవసరమని, తెలంగాణకంటూ ఉన్న ఒక ఇంటి పార్టీ బీఆర్ఎస్ అని వెల్లడించారు. తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామరక్ష అన్న జయశంకర్ సార్ మాటలు ఎప్పటికీ వాస్తవంగా నిలుస్తాయన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. 2001లో ఉన్న శూన్యం లాంటి వాతావరణంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం బీఆర్ఎస్‌ను కేసీఆర్ ఏర్పాటు చేశారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ నడిపిన తెలంగాణ ఉద్యమం దేశంలోని అనేక రాష్ట్రాలకు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజాస్వామిక ఉద్యమాలకు ఒక దిక్సూచిగా, ఆదర్శంగా ..మిగతా 2లో

### మారిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ
# పరీక్షల తేదీలు

### మే 24 నుండి జూన్ 3 వరకు పరీక్షల తేదీల మార్పు



హైదరాబాద్, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం): తెలంగాణ ఇంటర్ బోర్డు కీలక ప్రకటన చేసింది. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల తేదీల్లో మార్పులు చేసింది ఇంటర్ బోర్డు. ముందుగా మే 24 నుండి జూన్ 1 వరకు ఉన్న పరీక్షల తేదీలను.. మే 24 నుండి జూన్3 వరకు పరీక్షల తేదీలను మార్చింది బోర్డు. మే 27న నల్లగొండ?ఖమ్మం?వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఉన్న నేపథ్యంలో ఈ మార్పులు చేసినట్లుగా తెలుస్తుంది. ఫస్టియర్, సెకండియర్ పరీక్షలు ఒకే రోజున ..మిగతా 2లో

# కాళేశ్వరంపై విచారణకు పిలిస్తే తప్పేముంది

### కొన్ని విషయాల్లో మోడీని నమ్మి మోసపోయాం
### అనవసరంగా నోట్ల రద్దుకు మద్దతు ఇచ్చాం
### బీఆర్ఎస్ 8నుంచి 9 సీట్లు సాధిస్తుంది
### మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్ వెల్లడి

2



### కాంగ్రెస్ పాలనలో
# అన్నివర్గాలకు ఇబ్బందులు

### మాయమాటలతో అధికారంలోకి వచ్చారు
### ఆవిర్భావ సభలో ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్దిపేట, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శిం చారు. మాయమాటలు చెప్పి ఆ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదన్నారు. తెలంగాణకు నష్టం జరిగిన ప్రతిసారి బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం చేసిందని చెప్పారు. ఒక్కడితో మొదలైన బీఆర్ఎస్ ప్రస్థానం ఉధృతమై ఉప్పెనగా మారి స్వరాష్ట్ర కలను సాకారం చేసిందని సిద్ది పేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భావజాల వ్యాప్తి చేసి ప్రజలను కేసీఆర్ చైతన్యపరిచారని తెలిపారు. అంగబలం, అర్థబలం కలిగిన ఆంధ్ర నాయకత్వాలను ఎదిరించి నిలబడ్డారని చెప్పారు. తెలంగాణ వాదాన్ని అణిచివేయాలన్న ప్రతిసారి ఉ ద్యమం మరింత ఉధృతం చేశారన్నారు. తన పదవులను గడ్డిపోచలుగా వదిలేసి ప్రజల్లో చర్చపెట్టి తెలంగాణ వాదాన్ని గెలిపించారన్నారు. జలదృశ్యం నుంచి జన దృశ్యంగా మారిన పరిణామంలో ఎన్నో ఎత్తుపల్లాలు, ఒడిదుడుకులు, అణచివేతలు, అనుమానాలు ఎదురయ్యాయని గుర్తుచేసుకున్నారు. బీఆర్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలు, పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే హరీశ్ రావు శుభాకాంక్షలు ..మిగతా 2లో

# కాళేశ్వరంపై విచారణకు పిలిస్తే తప్పేముంది



హైదరాబాద్, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం): కాళేశ్వరంపై విచారణకు మాజీ సీఎం కేసీఆర్ ను పిలిస్తే తప్పులేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ వెంటనే మాజీ ముఖ్యమంత్రి నుంచి తెలుసుకోవాలనుకోవడం తప్పులేదంటూ చమత్కరించారు. తాము కేంద్రంలోని బీజేపీ సర్కారుకు అంశాల వారీగానే మద్దతు ఇచ్చామని అన్నారు. ప్రధాని మోదీ మాట నమ్మి నోట్ల రద్దుకు సహకరించామని చెప్పారు. తర్వాత చెంపలేసుకున్నామని అన్నారు. ఇవాళ తెలంగాణ భవన్ లో మీడియాతో కేటీఆర్ చిట్ చాట్ చేశారు. కడియం శ్రీహరి పార్టీ కి ద్రోహం చేశారని పేర్కొన్నారు. ఆయన వరంగల్ ప్రజలను వంచించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీవి ఉదెర పథకాలని, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాదని అన్నారు. ఈ లోక్ సభ ఎన్నికల్లో తమ పార్టీ 8 నుంచి 9 సీట్లలో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కొంచం గట్టిగా ప్రయత్నిస్తే 12 సీట్లు గెలుస్తామని కేటీఆర్ చెప్పారు. ఓట్లు వేయకుంటే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఎత్తేస్తానని సీఎం బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి మల్లారెడ్డి చాలా తెలివైనోడని, కావాలనే ఈటలను మునగ చెట్టు ఎక్కించారని అన్నారు. ఈటల రాజేందర్ ను ఇప్పటి వరకు రెండు సార్లు ఓడించామని, మూడో సారి కూడా ఓడిస్తామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డికి, భట్టి విక్రమార్కకు ఓడిపోతున్నామని అర్థమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీవన్నీ ఉదెర పథకాలని అన్నారు. కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ లీడర్ల పట్ల తీవ్రమైన వ్యతిరేకత ఉందన్నారు. వాళ్లు మళ్లీ వస్తామన్నా తమ పార్టీలోకి రానివ్వబోమని చెప్పారు. ఏపీలో తమకున్న సమాచారం మేరకు వైఎస్సార్ సీపీ విజయం సాధించబోతున్నదని అన్నారు. హరీశ్ రావు రాజీనామా సవాల్ పై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని అన్నారు. ఒట్లు ప్రమాణాలు కాదని సవాల్ ను స్వీకరించాలని అన్నారు. దమ్ముంటే హరీశ్‌రావు సవాల్‌కు రేవంత్ రెడ్డి స్పందించాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. రేవంత్ రెడ్డి తన సొంత జిల్లాలో గెలవడం కూడా కష్టమే అని కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డిది మాట నిలుపుకున్న చరిత్ర కాదు.. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం అన్నాడు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా గెలుస్తామని చెప్పి ఓడిపోయిన తర్వాత మాట తప్పాడు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోసం పార్ట్-1 జరిగింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు మోసం పార్ట్ -2 కొనసాగుతోంది. ఎట్టి పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి రుణమాఫీ చేయడు. నేతి బీరకాయలో నెయ్యి ఉండని తీరుగానే రేవంత్ రెడ్డి మాటల్లో నిజాయితీ ఉండదు. ముఖ్యమంత్రిగా అవకాశం ఇచ్చిన పార్టీకే రేవంత్ రెడ్డి కట్టుబడి లేడు. ఆయన ఏ సవాల్‌కు కట్టుబడి ఉన్నాడో చెప్పాలె అని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు మాకు రాజకీయ ప్రత్యర్థులే. ఈ రెండు పార్టీలు చేసిన ద్రోహానికి దేశానికి ఎంతో నష్టం జరిగింది. అందుకే కాంగ్రెస్, బీజేపీలను తిరస్కరించి ప్రాంతీయ పార్టీలకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాం. కాంగ్రెస్‌కు బీజేపీని ఎదుర్కొనే శక్తి లేదు బీజేపీని ఎదుర్కొనే శక్తి ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఉంది. బీజేపీని ఎదుర్కొనే శక్తి లేకనే రాహుల్ గాంధీ ఉత్తర భారతదేశం నుంచి కేరళకు పారిపోయిండు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ఒత్తిడి చేసిన ఎదుర్కొని బీజేపీని తట్టుకుంటున్నది ప్రాంతీయ శక్తులే. ఒకనాడు ఎన్టీ రామారావు భారతదేశం అనే పార్టీ పెట్టాలనుకున్నాడు. కానీ ఆయన శిష్యుడు కేసీఆర్ జాతీయ పార్టీ పెట్టాడు. ఇప్పుడు కాకున్నా భవిష్యత్తులో అయినా విస్తరించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. ప్రస్తుతానికి తెలంగాణలో పూర్వ వైభవం సంతరించుకోవటానికి కష్టపడుతున్నాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.



## రిజర్వేషన్ల రద్దుకు బిజెపి కుట్రలు

**మొదటి పేజీ తరువాయి...**

అన్నారు. ఆయనపై కేటీఆర్ ఎందుకు చర్యలు తీసుకోలేదు. ఈటలను కేటీఆర్ ఎందుకు విమర్శించడం లేదని ప్రశ్నించారు. ఐదు నియోజకవర్గాల్లో భాజపాకు భారాస మద్దతు ఇస్తోందని నేను చెబుతూనే ఉన్నా. అది నిజమని నిన్న మల్లారెడ్డి మాటలతో స్పష్టమైంది. పదేళ్లపాటు కేసీఆర్ భూములు అమ్ముతుంటే ఈటల రాజేందర్ ఎప్పుడైనా మాట్లాడారా? నేను రుణమాఫీ చేస్తాను అనగానే భూములు అమ్మవద్దని ఈటల కండీషన్లు పెడతున్నారని మండిపడ్డారు. 'మోదీ, అమిత్ షా అన్ని వ్యవస్థలను వాడుకుంటున్నారు. దేశ జనాభా ఆధారంగా కాంగ్రెస్ రిజర్వేషన్లు నిర్ణయించింది. ఆర్ఎస్ఎస్ అనుకూల వర్గాలు రిజర్వేషన్లను వ్యతిరేకించాయి. రిజర్వేషన్లు ఎత్తేసే కుట్ర బీజేపీ చేస్తోందని, అయితే రాహుల్ గాంధీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. భారత్‌ను పూర్తి హిందూదేశంగా మార్చబోతున్నారు. రాజ్యాంగాన్ని సైతం మార్చబోతున్నారు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలపై బీజేపీ సర్జికల్ స్ట్రైక్ చేస్తుంది. రాహుల్ గాంధీపై మోదీ, అమిత్ షా అసత్య ఆరోపణలు చేస్తున్నారు. తాళి పుస్తెలు గుంజుకుంటారని మోదీ లాంటి వారు ప్రచారం చేస్తున్నారు. భార్య ఆస్తి పై భర్తకు హక్కు లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.. ఇలాంటి సమయంలో ఆస్తులు గుంజుకుంటారని ఆరోపణలు చేస్తున్నారు. ఆర్ఎస్ ఎస్ విధానాలను బీజేపీ అమలు చేస్తుంది. ఈస్ట్ ఇండియా కంపెనీ విధానాన్ని మోదీ,అమిత్ షా అమలు చేస్తున్నారు. రిజర్వేషన్ల రద్దుపై బీజేపీ అధిష్టానం ఎందుకు మౌనంగా ఉంటుంది. జనాభా లెక్కలు జరిగితేనే రిజర్వేషన్ల పెంపు సాధ్యం అవుతుంది.. అందుకే జనాభా లెక్కలు బీజేపీ ప్రభుత్వం చేయడం లేదని రేవంత్ వ్యాఖ్యానించారు. కిషన్‌రెడ్డి, ఈటల ఎందుకు మాట్లాడడం లేదు.. అన్ని విషయాలు మాట్లాడుతున్న కేసీఆర్ ఈ విషయం గురించి ఎందుకు స్పందించడం లేదు?. రిజర్వేషన్ల విషయంలో కేసీఆర్ తన విధానాన్ని ప్రకటించాలి. వంద రోజులకే మమ్మల్ని దిగిపోవాలని అంటున్న కేసీఆర్.. పదేళ్ల బీజేపీ ప్రభుత్వాన్ని ఎందుకు అనడం లేదని అన్నారు.




## ప్రజల గొంతుకగా మాట్లాడుతూనే ఉంటాం

**మొదటి పేజీ తరువాయి...**

నిలిచిందని చెప్పారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ జెండాను కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సహకారంతోనే రాష్ట్రం సహకారమయిందని, పార్టీ తరఫున ఏమిచ్చినా వారి రుణం తీర్చుకోలేమన్నారు. సమైక్యవాద శక్తుల కుట్రలను ఛేదించి తెలంగాణ ప్రజల గొంతుకను అన్ని చట్టసభల్లో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) వినిపించిందని చెప్పారు. సాధించుకున్న తెలంగాణకు సరైన నాయకత్వం కేసీఆర్‌దే అని 2014లో తమ పార్టీకి ప్రజలు అవకాశం ఇచ్చారని చెప్పారు. తొమ్మిదిన్నర సంవత్సరాల పరిపాలనలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు, అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేశామని వెల్లడించారు. తెలంగాణలో సాధించిన ప్రగతిని ఇతర ప్రాంతాలకు విస్తరించాలన్న ఒక సదుద్దేశంతో పార్టీ పేరును భారత రాష్ట్ర సమితిగా మార్చి జాతీయ పార్టీగా రూపాంతరం చెందిందని తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఒరిస్సా వంటి రాష్ట్రాల్లో బీఆర్ఎస్‌కు అద్భుతమైన స్పందన లభించిందని వెల్లడించారు. అయితే దురదృష్టవశాత్తు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అనుకూల ఫలితాలు రాలేదని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తలపెట్టిన ఏ పనినైనా వదలకుండా ముందుకు తీసుకుపోయిన చరిత్ర గత రెండున్నర దశాబ్దాలలో ప్రజలందరికీ తెలుసన్నారు. బోధించు, సమీకరించి, పోరాడు అనే అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ఒంటపట్టించుకుని ముందుకు నడుస్తున్న పార్టీ బీఆర్ఎస్ అని వెల్లడించారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలందరికీ, తమకు మద్దతుగా నిలబడిన తెలంగాణ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజల కోసం, వారి ఆకాంక్షల కోసం పోరాడిన గులాబీ దండుకు, ప్రాణాలు అర్పించి తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన వందలాదిమంది తెలంగాణ అమరవీరులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజలందరికీ రుణపడి ఉంటామని, కేసీఆర్ చూపిస్తున్న బాటలో మరోసారి పూనరంకితం అవుతామని స్పష్టం చేశారు.

# నవరత్నాలతో పేదలకు సంక్షేమం అందించా

**99శాతం హామీలు అమలు చేసిన ఘనత మాది**
**అదే లక్ష్యంతో మరింత మేలు చేసేలా ముందుకు**
**పథకాలు కొనసాగిస్తూనే మరిన్ని సంక్షేమాల అమలు**
**మేనిఫెస్టో అంటూ పరమపవిత్ర గ్రంథం**
**పార్టీ కార్యాలయంలో మేనిఫెస్టో విడుదల చేసిన జగన్**



అమరావతి, ఏప్రిల్27 (ప్రభాత ఉదయం): ఆంధ్రప్రదేశ్‌లో గత 58 నెలల కాలంలో హామీలు అమలు చేసిన తీరు చరిత్రలోనే నిలిచిపోతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా చిరునవ్వుతో ప్రజలకు తోడుగా ఉన్నామని, ఆఖరికి కోవిడ్ లాంటి కష్టకాలంలోనూ సాకులు చెప్పకుండా సంక్షేమం అమలు చేశామని సీఎం జగన్ చెప్పారు. శనివారం ఉదయం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో 2024ను విడుదల చేశారు. మేనిఫెస్టో అంటే పవిత్రమైన గ్రంథం. గతంలో ఎన్నికలప్పుడు రంగు రంగుల హామీలతో ముందుకు వచ్చేవారు. కానీ, మేం మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించాం. గత ఐదేళ్లలోనే మేనిఫెస్టోకు ప్రాధాన్యత వచ్చింది. ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో, అధికారి దగ్గర మేనిఫెస్టో ఉంది. రాష్ట్రంలో ప్రతీ ఇంటికి మేనిఫెస్టోను పంపించాం. ఓ ప్రొగ్రెస్ కార్డు మాదిరి ఏం ఏం చేశామన్నది ప్రజలకు ఎప్పటికప్పుడు వివరిస్తూ వచ్చాం. ఈ 58 నెలల్లో పథకాల్ని డోర్ డెలివరీ చేశాం. ఏ నెలలో ఏ పథకాల్ని ఇస్తామో చెప్పి మరీ అమలు చేశామని అన్నారు. 2019లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశాం. 2014లోనూ నాకు బాగా గుర్తుంది. ఆనాడు కూడా చేయగలిగిందే చెప్పాం. అమలు చేసినా, చేయకున్నా.. చంద్రబాబులా హామీలు ఇచ్చేదామని చాలామంది నా మంచి కోసమంటూ చెప్పారు. కానీ, నేను మాత్రం మోసపూరిత హామీల్లో చంద్రబాబుతో పోటీ పడలేకపోయా. చరిత్రలో చరిత్రహీనుడిగా మిగిలిపోకుండా ఉండేందుకు.. చేయగలిగింది మాత్రమే చెప్పా. 2019లో చేయగలిగిందే చెప్పా. చెప్పిందంతా చేసి చూపించి ప్రజలకు దగ్గరకు ఒక హీరోగా వెళ్తున్నా. ఇదీ గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా. ప్రజలు ఈ తేడా గమనించాలి. నాయకుడిని నమ్మి ప్రజలు ఓటేస్తారు. లీడర్‌షిప్ అంటే చెప్పిన ప్రతీ మాట అమలు చేస్తూ ముందుకు వెళ్లడమేనని అన్నారు. నా పాదయాత్రలో ఎన్నో కష్టాలు చూశాం. చదివించా లని ఉన్నా.. చదివించలేని తల్లుల పరిస్థితిని కళ్లారా చూశా. నేను చూసిన పరిస్థితులకు పరిష్కారం కోసం ఈ 58 నెలల పాలనతో పని చేశా. పేదలకు సంక్షేమం అందించాం. అర్హులను జల్లెడ పట్టి మరీ వెతికి సంక్షేమం అందించాం. ఎమ్మెల్యేలు గడప గడపకు వెళ్లడమూ ఎప్పుడూ జరగలేదన్నారు. ప్రజలు నమ్మి ఓటేస్తే కనీసం ఒక్క హామీ అయినా చంద్రబాబు నాయుడు అమలు చేశారా?. ముఖ్యమైన హామీలతో చంద్రబాబు సంతకం పెట్టి గతంలో ఇదే కూటమి ప్రజలను మోసం చేసింది. రుణమాఫీ, డ్వాక్రా రుణాల పేరుతోనూ చంద్రబాబు మోసం చేశారు. సున్నా వడ్డీని ఎగ్గొట్టారు. సింగపూర్‌ను మించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతీ నగరంలోనూ హైటెక్ సిటీ కడతానంటూ అబద్ధాలు చెప్పారు. కనీసం ప్రత్యేక హోదా అంశాన్ని కూడా పట్టించుకోకుండా.. అదేమైనా సంజీవనా? అంటూ వెటకారంగా మాట్లాడారు. సాధ్యంకాని హామీలిచ్చి చంద్రబాబు చేసింది మోసం కాదా? విశ్వసనీయత లేనప్పుడు రాజకీయాలు చేయడం ఎందుకు?. రాజకీయ నాయకుడంటే.. తాను చనిపోయాక ప్రతీ ఇంట్లో తన ఫొటో, పేదవాడి గుండెల్లో మనం ఉండాలనే తాపత్రయం ఉండాలని అన్నారు. మొట్టమొదటిసారిగా సామాజిక న్యాయం అమలు అవుతోంది. సామాజిక న్యాయం మాటల్లో కాదు.. చేతల్లో చూపిస్తున్నాం. చట్టం అమలు చేసి 50 శాతం రిజర్వేషన్లతో నామినేటెడ్ పదవులు ఇచ్చామని అన్నారు. బీసీ, ఎస్టీ, ఎస్టీ, మైనారిటీలకు పదవులిచ్చాం. 60 శాతం మంత్రి పదవులు పేద విద్యార్థులు అనర్గళంగా ఆంగ్లంలో మాట్లాడితే మంచి ఉద్యోగాలు వస్తాయి. గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యాన్ని సాధ్యం చేసి చూపించాం. పంటల కొనుగోలులో దళారుల వ్యవస్థ లేకుండా చేశామని అన్నారు. మేం ఇచ్చిన హామీలను ఎంతో నిష్టగా అమలు చేశాం. ఎక్కడా లంచాల ప్రస్తావన లేకుండా డీబీటీ ద్వారా సంక్షేమం అందించాం. 2014-19 మధ్య 32 వేల ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారు. గత 58 నెలల్లో 2 లక్షల 31 వేల ఉద్యోగాలిచ్చాం. ఆరోగ్యశ్రీ, సంపూర్ణ పోషణ, ఫీజు రియంబర్స్‌మెంట్, గోరుముద్ద, ఈ పథకాలన్నీ ఆపడం ఎవరి చేత కాదు. జగన్ ఎంతో కష్టపడితేనే ఈ పథకాలు అమలు అవుతున్నాయి. వీటిని ఆపడం, తొలగించడం ఎవరి వల్ల కాదు. చంద్రబాబు చెబుతున్న పథకాలను లక్షా 21 వేల కోట్ల రూపాయలు అవసరం. మనం అమలు చేస్తున్న పథకాలకు ఏడాదికి 29 వేల 100 కోట్లు ఖర్చు చేయాల్సిందే. అంటే.. చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ 10 హామీలకు మన సంక్షేమ పథకాల కలిపి అమలు అమలు చేయాలంటే కచ్చితంగా అక్షరాల లక్షా 50 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. మరి ఇది ఎలా సాధ్యం?.. మాట్లాడితే చంద్రబాబు సంపద సృష్టిస్తానంటారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో సంపద సృష్టిని పరిశీలిస్తే.. ప్రతీ ఏడాదిలోనూ రెవెన్యూ లోటే కనిపించింది. మరి ఎక్కడ సృష్టించారు? తాను సంపద సృష్టించానని చంద్రబాబు సిగ్గు లేకుండా ఎలా చెప్పుకుంటున్నారు? అని సీఎం జగన్ నిలదీశారు. సమర్థవంతమైన ఆర్థిక నియంత్రణ కూడా లేదు. 2014-19 చంద్రబాబు పాలనలో అప్పులు భారీగా పెరిగాయి. చంద్రబాబు హయాంలో అప్పులు 21.8 శాతం పెరిగాయి. మా పాలనలో అప్పులు కేవలం 12.13 శాతానికి పరిమితమైంది. రెండేళ్లలో కోవిడ్ పరిస్థితులతో ఆదాయం తగ్గినా సంక్షేమ పథకాలు అమలు చేశాం. చంద్రబాబు హయాంలో 4.47 శాతం జీఎస్ డీపీ ఉంటే మన హయాంలో 4.83 శాతం జీఎస్ డీపీ ఉంది. ట్యాక్స్‌లు వేసి బాదేస్తున్నారని ప్రచారం చేస్తున్నారు. అది కూడా చూద్దాం. చంద్రబాబు హయాంలో పన్నుల భారం 6.57 శాతం అయితే జగన్ హయాంలో 6.35 శాతం. అన్నింటికీ లెక్కలు ఉన్నాయి. జగన్ ఎప్పుడు అబద్ధాలు ఆడడు. జగన్ ఎప్పుడూ మోసం చేయడు. పేదలను ప్రేమించి, అభిమానించే విషయంలో మేనిఫెస్టోలో పెట్టినా.. పెట్టకపోయినా జగన్ వేసిన అడుగులు రాష్ట్రంలో ఎవరూ వేయలేరు. అవకాశం, వెసులుబాటు ఏమాత్రం ఉన్నా కూడా జగన్ పేదవాళ్ల కోసం అడుగులు వేస్తాడు. పేదవాళ్లు మంచి చేసే విషయంలో జగన్‌కు ఉన్న ప్రేమ మరెవరికీ ఉండదు.. ఉండబోదు. జగన్‌కు మనసు ఉంది. కల్మషం లేదు. పెన్షన్ల విషయంలో అవ్వాతాతల మీద చూపించిన ప్రేమ చరిత్రలో ఎవరూ చూపించలేదని అన్నారు.



## కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు ఇబ్బందులు

**మొదటి పేజీ తరువాయి...**

తెలిపారు. 23 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణంలో కేసీఆర్ ఎన్నడూ ఎత్తిన జెండా దించలేదని, పట్టిన పట్టును విడువలేదని చెప్పారు. గులాబీ జెండానే గులాంగిరీని అంతం చేసి తెలంగాణను తెచ్చిపెట్టిందని వెల్లడించారు. పదేండ్ల పాలనలో ప్రజలకు అద్భుతమైన ప్రగతి ఫలాలు అందించిందన్నారు. ఈ ఘనత ముమ్మాటికీ గులాబీ జెండాదేనని చెప్పారు. ఆత్మగౌరవంతో బతికే జాతి తెలంగాణ జాతి అని వెల్లడించారు. ఆత్మగౌరవం దెబ్బతిన్నప్పుడల్లా ధిక్కార స్వరమై నిలిచిందని పేర్కొన్నారు. ఇప్పుడు మరోసారి ప్రజలకోసం ప్రజా ఉద్యమం చేసేందుకు బీఆర్ఎస్ సంసిద్ధమైందని హరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావం సందర్భంగా సిద్దిపేటలో పార్టీ కార్యాలయంలో గులాబీ జెండాను హరీశ్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదని చెప్పారు. మన పథకాలను బీజేపీ కాపీ కొట్టిందని విమర్శించారు. అభివృద్ధిలో కేసీఆర్ ఆదర్శంగా ఉంటే.. తిట్లలో రేవంత్ రెడ్డి ఆదర్శంగా ఉన్నారని చెప్పారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తే రాజీనామాకు సిద్ధంగా ఉన్నానని మరోసారి స్పష్టం చేశారు. తనకు పదవులు ముఖ్యం కాదని, ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. నాడు ఓటుకు నోటు, నేడు దేవుళ్లపై ఒట్లు అంటూ ముఖ్యమంత్రిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. హామీలు అమయ్యే వరకు పోరాటం చేస్తూనే ఉంటామన్నారు.



## తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో కీలక పరిణామం

**మొదటి పేజీ తరువాయి...**

ఇండియా కూటమితో కలిసి పనిచేయనున్నారని రేవంత్ గుర్తు చేశారు. ఒకట్రెండు విషయాల్లో సందిగ్ధత ఉన్నా... అధిష్టానంతో చర్చించి రేపటిలోగా ఏకాభిప్రాయానికి వస్తామన్నారు. సీపీఎం సహకారంతో భవిష్యత్ లో ముందుకెళతామని ప్రకటించారు. ఈ కలయిక రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపునకు పనిచేస్తుందని భావిస్తున్నానన్నారు. కమ్యూనిస్టుల్లో మరో పార్టీ అయిన సీపీఐ ఇప్పటికే కాంగ్రెస్ కు మద్దతు ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, కాంగ్రెస్ కలసి పోటీ చేశాయి. అయితే సీపీఐకి ఒక్కటంటే ఒక్క స్థానమే కేటాయించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్త గూడెం కేటాయించడంతో అక్కడ సీపీఐ గెలిచింది. కానీ తమకు కూడా ఒక్క సీటే కేటాయిస్తామని చెప్పడంతో .. సీపీఎం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తులు పెట్టుకోలేదు. విడిగానే పోటీ చేసింది. బలం ఉన్న చోటల్లా పోటీ చేసినా.. స్వయంగా తమ్మినేని వీరభద్రం పోటీ చేసినా ప్రయోజనం లేకపోయింది. ఎక్కడా డిపాజిట్లు కూడా రాలేదు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ పోటీ చేయడానికి అభ్యర్థుల్ని ప్రకటించింది. ఆ అభ్యర్థులు నామినేషన్లు కూడా వేశారు. జాతీయ స్థాయిలో కూడా కలసి పని చేస్తున్న కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఇక్కడ పోటీ చేయడం తగదని నిర్ణయించారు. అయితే సీపీఎం అభ్యర్థుల వల్ల కాంగ్రెస్ అభ్యర్థులకు ఎంతో కొంత నష్టం జరుగుతుందన్న భావనతో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీతో కలసి పని చేస్తున్న కమ్యూనిస్టులతో మాట్లాడాలని నిర్ణయించుకన్నారు. అందుకే తమ్మినేని వీరభద్రంను సిఎం రేవంత్ చర్చలకు ఆహ్వానించి నట్లుగా తెలుస్తోంది. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో కొంత ఓటు బ్యాంక్ ఉన్న సీపీఎం వల్ల కాంగ్రెస్ పార్టీకి కొంత మేర ఓట్లు కలిసి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## ఉగ్రవాదం తుదముట్టించాలి

**మొదటి పేజీ తరువాయి...**



కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారని అమిత్ షా ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాశ్మీర్‌లో రక్త ప్రవాహం కోసమే రాహుల్ ఈ విధంగా వ్యవహరించారని అమిత్ షా ఆరోపించారు. గత అయిదేళ్లలో కాశ్మీర్‌లో ఒక్క రక్తపాత ఘటన కూడా చోటు చేసుకోలేదని అమిత్ షా ఈ సందర్భంగా ఉదాహరించారు. అలాగే దేశంలో ఉగ్రవాదం, నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ పని చేస్తున్నారనీ వివరించారు. అలాగే ప్రదానిగా మన్మోహన్ సింగ్ ఉన్నప్పుడు దేశంలో ఎలా ఉంది, మోదీ ప్రధానిగా ఉన్నప్పుడు దేశంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో ఓ సారి ఆలోచించాలని ప్రజలకు ఈ సందర్భంగా సూచించారు. ఇక భారత్‌లో పుల్వామా, యూరీ ఘటనలకు పాక్ దుశ్చర్యలకు పాల్పడితే.. భారత్ మాత్రం సర్జికల్ స్ట్రైక్స్ ద్వారా ఆ దేశానికి జవాబు ఇచ్చిందని ఈ సందర్భంగా అమిత్ షా గుర్తు చేశారు. అలాగే కాంగ్రెస్ పాలనలో భారత్ ఆర్థిక పరిస్థితి 11వ స్థానంలో ఉండేదని.. కానీ మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్ ఆర్థిక పరిస్థితి 5వ స్థానానికి ఎగబాకిందన్నారు. అదీ కూడా కేవలం 10 ఏళ్లలోనే అని అమిత్ షా గుర్తు చేశారు. ప్రధానిగా మోదీకి మరో అవకాశం ఇస్తే.. భారతదేశాన్ని ప్రపంచంలోనే మూడో అతిపెద్ద శక్తిగా ఆవతరింప చేస్తారని.. అందుకు తాను గ్యారంటీ అని అమిత్ షా స్పష్టం చేశారు.

## మారిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల తేదీలు

**మొదటి పేజీ తరువాయి...**

నిర్వహిస్తారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ ఫస్ట్ ఈయర్ ఎగ్జామ్స్, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 వరకు ఇంటర్ సెకండ్ ఈయర్ పరీక్షలు నిర్వహించనున్నట్లుగా ఇంటర్ బోర్డు తెలిపింది. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఏప్రిల్ 25 నుంచి మే 2 వరకు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కాగా ఇటీవలే ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. ఫస్టియర్ ఫలితాల్లో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో టాప్ లోనిలవగా..సెకండియర్ రిజల్ట్ లో ములుగు జిల్లా అత్యధిక ఉత్తీర్ణతతో ఫస్ట్ ప్లేసులో నిలిచింది. ఫస్ట్ ఇయర్‌లో 60.01 శాతం ,సెకండియర్ లో 64.19 శాతం ఉత్తీర్ణత సాధించారు.

# యావత్ దేశం యువత మోడీ వెంటే: కొండా విశ్వేశ్వర్ రెడ్డి



శంషాబాద్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న చేవెళ్ల బిజెపి ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు, కార్యకర్తలు

రాజేంద్ర నగర్,27 ఏప్రిల్(ప్రభాత ఉదయం):దేశంలోని కోట్లాది మంది యువతీ యువకులంతా నరేంద్ర మోడీకి అండగా నిలిచారన్నారు చేవెళ్ల బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి.శంషాబాద్ లోని వైఎస్ఆర్ గార్డెన్స్ లో జరిగిన భారతీయ జనతా పార్టీ యువ మోర్చా యువ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...గత పదేళ్ల కాలంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఎంతోమంది యువతీ,యువకులకు ఉపాధి మార్గాలు చూపిందని అన్నారు.స్కిల్ డెవలప్మెంట్ కోర్సులు, ముద్రా లోన్స్ ద్వారా స్వయం ఉపాధి శక్తిని పెంపొందించిందన్నారు.భారతీయ సంస్కృతి సాంప్రదాయాల పట్ల యువతకు మార్గ నిర్దేశం చేసిన పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమేనని కొండా విశ్వేశ్వర్ రెడ్డి చెప్పారు.ఈ సార్వత్రిక ఎన్నికల్లో నరేంద్ర మోడీ సర్కారును ఆ బాసు పాలు చేసేందుకు ప్రతిపక్ష పార్టీలు ఎన్నో కుట్రలు చేస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మోడీ వెంట యువత నిలబడాలని కొండా విశ్వేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ మతతత్వ రాజకీయాలు చేస్తూ బిజెపిపై తప్పుడు ఆరోపణలు చేస్తుందని అన్నారు. నరేంద్ర మోడీ పాలనలో దేశ ప్రజలందరినీ కేంద్ర ప్రభుత్వం సమానంగా చూసిందని ఆయన చెప్పారు.మైనార్టీలను ఆదుకున్నది బిజెపినే..దేశంలో ముస్లిం మైనారిటీలను ఆదుకున్న ఘనత నరేంద్ర మోడీకె దక్కుతుందన్నారు.కొండా విశ్వేశ్వర్ రెడ్డి,ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో 31 శాతం,ముద్ర లోన్స్ లో 37 శాతం నిరుపేద ముస్లింలు లబ్ధిదారులుగా ఉన్నారని ఆయన చెప్పారు.భారతీయ జనతా పార్టీ కామన్ సివిల్ కోడ్ తీసుకురావడం ద్వారా దేశం మొత్తం ఒకే చట్టం పరిధిలోకి వచ్చిందని అన్నారు.ప్రపంచంలో మన దేశంలో తప్ప మరి ఏ దేశంలోనూ ఒక్కో మతానికి ఒక్కో చట్టం ఉండదని కొండా విశ్వేశ్వర్ రెడ్డి గుర్తు చేశారు. నరేంద్ర మోడీకి పోటీగా నిలబడ లేకనే రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్ కు పారిపోయాడని ఆయన ఎద్దేవా చేశారు. నరేంద్ర మోడీ పిలుపునిచ్చినట్టుగా 400 ఎంపీ స్థానాలు బిజెపి గెలుచుకోబోతుందని కొండా విశ్వేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.మన రాష్ట్రంలోనూ 12 స్థానాల్లో బిజెపి అభ్యర్థులు విజయం సాధించబోతున్నారని ఆయన చెప్పారు.చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి తన వెంట నాలుగు లక్షల ముస్లిం మైనార్టీ ఓట్లు ఉన్నాయని సంబరపడుతున్నాడని ఆయనకు యువకులంతా తగిన బుద్ధి చెప్పాలని ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్, ప్రధాన కార్యదర్శి గణేష్, కార్యవర్గ సభ్యులు ప్రేమ్ రాజ్, జంగయ్య యాదవ్, రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, చేవెళ్ల అధ్యక్షులు తరుణ్ రెడ్డి, శంషాబాద్ మున్సిపల్ అధ్యక్షులు దేవేందర్, కంటెస్టెంట్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి,బిజెపి నాయకులు నందకిషోర్,వంశీ యాదవ్,రాహుల్ రెడ్డి,శివ తో పాటు పలువురు బిజెపి ముఖ్య నాయకులు,కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ జీవీ సుబ్బారెడ్డి

## రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ఘనంగా కళాశాల దినోత్సవం

బుద్వేల్, ఏప్రిల్27(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల లో శనివారం ఘనంగా కళాశాల దినోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోరమండల్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జి.వి సుబ్బారెడ్డి పాల్గొన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. వెంకటరమణ అధ్యక్షత వహించారు. డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీమ, డీఎస్ఏ డాక్టర్ జె. సత్యనారాయణ, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ నరేంద ర్ రెడ్డి గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ముఖ్యఅతిథి డాక్టర్ జీవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో వ్యవసాయ రంగం పాత్ర ప్రముఖమైనదన్నారు. విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకోవడానికి ముందుండాలని సూచించారు. ప్రతి విద్యార్థి సమాజ సేవా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. వెంకటరమణ మాట్లాడుతూ రాబోయే రోజులలో వ్యవసాయానికి ప్రాముఖ్యత చాలా ఉంటుందని తెలుపారు. విద్యార్థులు అన్ని రకాలుగా అభివృద్ధి చెంది, రైతులకు సేవ చేయాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సీమ, డాక్టర్ జె. సత్యనారాయణ గౌరవ అతిథులుగా మాట్లాడారు. డాక్టర్ సి. నరేందర్ రెడ్డి కళాశాల అసోసియేట్ డీన్ మాట్లాడుతూ గత సంవత్సరాలలో విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల లలిత కళలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బిజెపి అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డిని సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు

## కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలే అసలైన మతతత్వ పార్టీలు

### ఓట్ల కోసం మైనార్టీలను మోసం చేస్తున్నాయి: బిజెపి చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

శంషాబాద్, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం) తమ రాజకీయ స్వార్థం కోసం ప్రజలను విభజించి పాలిస్తున్న కాంగ్రెస్,బి.ఆర్ ఎస్ పార్టీలే అసలు సిసలైన మతతత్వ పార్టీలని చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు యాదీష్ అధ్యక్షతన శనివారం శంషాబాద్ లో జరిగిన చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం బీజేవైఎం కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథులుగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి. తోకల శ్రీనివాస్ రెడ్డి. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ళ మహేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్. బీఆర్ఎస్ పార్టీలపై నిప్పులు చెరిగారు. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటినుండి కాంగ్రెస్ పార్టీ మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటూ వాళ్ళ జీవితాల్లో ఎదుగు బదులు లేకుండా చేస్తున్నదని ఆరోపించారు. ఒక వర్గం ప్రజలలో మతతత్వాన్ని పెంచి పోషిస్తూ. ఇతర మతాలపై ద్వేషాన్ని పెంచుతున్నాయని ఆయన ఆరోపించారు. వారికి విద్య. ఉపాధి. వైద్యం అందించకుండా మతతత్వవాదులుగా మారుస్తూ వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాతనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని వివరించారు. ప్రతి ఒక్కరికి కడుపునిండా తిండి. గూడు. ఉపాధి కల్పించడం కోసం నరేంద్ర మోడీ నాయకత్వంలోని ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని విశ్వేశ్వర్ రెడ్డి కొనియాడారు. సెక్యులర్ పార్టీల ముసుగులో మతతత్వాన్ని రెచ్చగొడుతూ వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మరోసారి బిజెపి అధికారంలోకి రావాలంటే చేవెళ్లలో తనను భారీ మెజార్టీతో గెలిపించడానికి కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని కోరారు. నరేంద్ర మోడీ దేశానికి మేలు చేస్తున్నందున ప్రజలందరూ ఆయన నాయకత్వాన్ని విశ్వసించి ఆయనను చూసి ఓట్లు వేస్తున్నారని అన్నారు . రాజేంద్రనగర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపిస్తే నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరిచిన వారం అవుతామని ప్రతి ఒక్కరూ కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి మోడీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. మోడీ సమర్థవంతమైన పాలన కారణంగానే ప్రపంచ దేశాలు భారత వైపు చూస్తున్నాయని ప్రపంచానికి భారత్ దిక్సూచిగా మారిందని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రేమ్ రాజు యాదవ్. జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి. మున్సిపల్ మండల యువమోర్చా అధ్యక్షులు వంశీ యాదవ్. బుక్క ప్రవీణ్ కుమార్. పార్టీ నాయకులు చింతల నందకిషోర్. కొనమోల దేవేందర్. మునగాల రాజిరెడ్డి. కనకమామిడి కిట్టు. అనంతయ్య గౌడ్ నియోజకవర్గంలోని బిజేవైఎం నాయకులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న పలుగుచెరువు మహేష్

## బీఆర్ఎస్ పార్టీకి రాజేంద్రనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి పలుగు చెరువు మహేష్ రాజీనామా

### రంజిత్ రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని ప్రకటన
### త్వరలో కండువా కప్పుకోనున్న 500 కార్యకర్తలు

బుద్వేల్, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం): రాజేంద్రగనర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకులు పలుగుచెరువు మహేశ్ ఆ పార్టీ కి శనివారం సాయంత్రం రాజీనామ చేశారు. గత మూడు పర్యాయాలు బీఆర్ఎస్ పార్టీకి పని చేసినట్టు చెప్పారు. 2016 నుంచి 2020 వరకు వార్డు సభ్యురాలుగా తమ కుటుంబం నుంచి సేవ అందించినట్టు వివరించారు. ఇన్ని రోజులు బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం మేరకు ఎంతో కృషి చేసినట్టు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ప్రోత్సాహం, సహకారంతో రాజకీయంగా సేవ చేసినట్టు వెల్లడించారు. ప్రస్తుతం దేశ, రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో దేశంలో మతతత్వ శక్తులను కట్టడి చేయాలంటే కాంగ్రెస్ తో కలసి నడవాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. మతతత్వ బీజేపీని కట్టడి చేసే శక్తి కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని అన్నారు. సెక్యూలర్ పార్టీ కాంగ్రెస్ కు దళితులు, క్రిస్టియన్స్, ముస్లిం, వెనకబడినవర్గాల అండగా నిలిచి మతోన్మాద బీజేపీ ఓడించాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి కష్టపడి ప్రభుత్వం ఏర్పాటు చేశారని ఆయన నాయకత్వంలో పని చేయాలని తాము సామూహిక నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రజా నాయకుడు చేవెళ్ళ ఎంపీ రంజిత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో ఘన మెజారిటీతో గెలిపించాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. తమ రాజీనామా పత్రాన్ని బీఆర్ఎస్ పార్టీ అధిష్టానంకు పంపించినట్టు మహేష్ చెప్పారు. త్వరలో 500 మందితో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్టు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనుముల జాన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవి తాపానికి మేడపై పడుకున్న వ్యక్తి హత్య



మహమ్మద్ ఆర్బాజ్

బుద్వేల్, ఏప్రిల్27(ప్రభాత ఉదయం): వేసవి తాపానికి మేడపై పడుకున్న ఓ యువకున్ని దారుణంగా హత్య చేశారు. మైలార్ దేవుపల్లి పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కామారెడ్డి ప్రాంతానికి చెందిన మహమ్మద్ అర్బాజ్ (23 ) ఐదు సంవత్సరాలుగా లక్ష్మి గూడ రాజీవ్ గృహకల్ప లో నివాసం ఉండే సోదరి ఉజ్వా బేగం వద్ద ఉండి ఆటో నడుపుకుంటున్నాడు. అతనికి పెళ్లి కాలేదు. శుక్రవారం సాయంత్రం స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తుండగా వారి మధ్య గొడవ జరిగింది. ఆ తరువాత ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. వేసవి తాపానికి మహమ్మద్ ఆర్బాజ్ తాము ఉండే అపార్ట్ మెంట్ పైకప్పులో నిద్రపోయాడు. శనివారం ఉదయం ఎంతకు లేవకపోవడంతో సోదరి ఉజువ బేగం పదిన్నర గంటల సమయంలో వచ్చి చూడగా ఆయన మరణించి కనిపించాడు. గుర్తు తెలియని వ్యక్తులు బలమైన రాడ్ తో కొట్టడం వల్ల అతని తల పగిలిపోయింది. స్థానికుల సాయంతో ఉజ్వ బేగం మైలార్ దేవుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది . కేసు నమోదు చేసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివారాలను సేకరించారు. క్లూస్ టీం ను రప్పించి వేలిముద్రలను తీసుకున్నారు. శుక్రవారం సాయంత్రం గొడవపడ్డ స్నేహితులే హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ పి మధు తెలిపారు.



రాజేంద్రనగర్ లో సమావేశమైన కాంగ్రెస్ యువ నాయకులు

## చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలవడం ఖాయం

### కొండకల్ల నాగేందర్ రెడ్డి

రాజేంద్రనగర్, ఏప్రిల్ 27(ప్రభాత ఉదయం) చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలవడం ఖాయం అని రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజక వర్గ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండకల్ల నాగేందర్ రెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన ఆవేశంలో ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది .ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకల్ల నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ... యువజన కాంగ్రెస్ విభాగం మన చేవెళ్ల పార్లమెంట్ నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి గెలుపు కోసం పని చేయాలి అని, మన యువజన నాయకుల కార్యకర్తల సత్తా చూపాలని, గెలుపు కొరకు ప్రతి నాయకులు, కార్యకర్తలు శాయశక్తులా పని చేయాలి అని పలువురు నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఇంఛార్జి జిషన్ అహ్మద్ , జనరల్ సెక్రెటరీలు శ్రీకాంత్ ముడుమాల, రవి చెరుకుల, బబ్లూ, సతీష్, ప్రశాంత్,చందు యాదవ్, సెక్రెటరీ మనోహర్, బండ్లగూడ కార్పొరేషన్ యువజన నాయకులు అమ్మెనుద్దీన్, శాస్త్రిపురం యువజన నాయకులు ముజిబ్,అత్తాపూర్ డివిజన్ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంతోష్, రాజేంద్రనగర్ డివిజన్ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్, వైస్ ప్రెసిడెంట్ నిఖిల్, జనరల్ సెక్రటరీ దుర్గ రావు, తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ కమలం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న బిజెపి దళిత మూర్ఛ రాష్ట్ర నాయకులు జోగి రవి

## దేశ ప్రజలు ప్రధాన నరేంద్ర మోడీ నాయకత్వాన్ని మరోసారి కోరుకుంటున్నారు: జోగి రవి

### వెంకటేశ్వర కాలనీలో ఇంటింటికి ప్రచారం నిర్వహించిన బిజెపి నాయకులు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 27(ప్రభాత ఉదయం ) కేంద్రంలో మరోసారి ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని బిజెపి దళిత మోర్చా నాయకులు జోగి రవి అన్నారు. శనివారం సర్కిల్ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ(324 బూత్ లో), శ్రీరామ్ నగర్, గగన్‌పహాడ్ ల్లో జోగి రవి జోగి రవి పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి భారీ మెజార్టీతో గెలవడం ఖాయం అన్నారు. ప్రచారంలో ఎక్కడికి వెళ్ళినా ప్రజలు బిజెపికి ఓటు వేయటానికి ఉత్సాహం చెప్తున్నారన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో బిజెపి నాయకులు ఇ.శివారెడ్డి , ప్రసాద్, ఎల్. నవీన్‌కుమార్, అడికే జనార్దన్, కె. శ్రీకాంత్ రెడ్డి, రామారావు, చంద్ర శేఖర్, బాలకృష్ణ, బట్ట రాజు, బానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దుర్గా కన్వేషన్ లో జరిగిన మైనారిటీ మహిళల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## మైనారిటీ మహిళల ఆత్మీయ సమ్మేళనం

బుద్వేల్, ఏప్రిల్27(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ నియోజకవర్గం మైనార్టీ మహిళల బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం వందలాది మంది మహిళలతో మైలార్దేవ్ పల్లి డివిజన్ దుర్గా కన్వెన్షన్ హాల్ లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హొం శాఖ మాజీ మంత్రి మహమూద్ అలీ, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుల పుట్టం పురుషోత్తం తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మోసపూరిత హామీలు ఇస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసం ప్రజలు గుర్తించారని , పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ని గెలిపించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు...

## చేవెళ్లలో బిజెపి అభ్యర్థి కొండా గెలుపు ఖాయం

### జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి వనితా రెడ్డి చైతన్య విలాస్ కాలనీలో ఇంటింటికి బిజెపి ప్రచారం



చైతన్య విలాస్ కాలనీ లో ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్న బిజెపి శ్రేణులు



బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి గెలుపు కోసం కమలం గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహిస్తున్న బిజెపి నాయకులు, నాయకురాలు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 27(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మర్పల్లి చైతన్య విలాస్ కాలనీలో బిజెపి మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం వనిత రెడ్డి పార్టీ నాయకులత కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. శనివారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని బూత్ నంబర్ 203 (ఎర్రబోడ) లో వనిత రెడ్డి పార్టీ నాయకులు మల్లేష్ చారి, వెంకటేష్, శ్రీరామ్ లతో కలిసి కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ ప్రగతి కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కమలం పువ్వుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించటానికి ప్రజలను కోరుతామన్నారు.

# దేశ అభివృద్ధి, శాంతి భద్రతల పరిరక్షణ
# ఒక ప్రధాని మోడీతోనే సాధ్యం

## వివేకానంద పబ్లిక్ స్కూల్‌లో ఐటీ ప్రొఫెషనల్ ఆత్మీయ సమావేశం... పాల్గొన్న ఈటల రాజేందర్.




కూకట్‌పల్లి, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం): భారతదేశ అభివృద్ధి, శాంతి భద్రతల పరిరక్షణ మన ప్రధానమంత్రి మోడీతోనే సాధ్యమవుతుందని మల్కాజ్గిరి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. శనివారం కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలోని వివేకానంద పబ్లిక్ స్కూల్ లో ఏర్పాటుచేసిన ఐటీ ప్రొఫెషనల్ ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ నేడు భారతీయులు గర్వంగా ప్రపంచ దేశాలలో తలెత్తుకొని జీవిస్తున్నారని, మీరు సోషల్ మీడియా ద్వారా ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు, ప్రధాని మోదీ గురించి సరైన ప్రచారాన్ని చేయాలని కోరారు. టాయిలెట్లు కట్టించి మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడిన గొప్ప వ్యక్తి నరేంద్రమోదీ, 50 ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడూ ఈ మహిళల బాధను అర్థం చేసుకోలేదని,గతంలో కేసీఆర్ కూడా రాష్ట్రఆదాయాన్ని లెక్క చేయకుండా లక్ష రూపాయల రుణ మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రైతులకు ఎక్కడా అప్పు పుట్టలేదు, వారి రుణాలు మాఫీ కాకపోవడం, బ్యాంకులకు డబ్బు కట్టకపోవడంతో వారు అష్టకష్టాలు పడ్డారని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నవారు పాలక పక్షంపై కొట్లాడడం రాజకీయాలలోసహజమే కానీ నేను అధికారంలో ఉండి కూడా కొట్లాడిన విషయం మీతో పంచుకుంటున్నాను అని అన్నారు. నేను ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు మున్సిపల్ కార్మికులు సమ్మె చేశారు. మంత్రిగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ వద్దకు పోయి వారి సమస్యను పరిష్కరించమని కోరాను, డ్రైనేజ్ సంపుల్లో ప్రాణాలు పణంగా పెట్టి పనిచేస్తున్న వారిని ఆదరించాలని, వారికి కేవలం 8వేల రూపాయల జీతం సరిపోదని వారు సమ్మెచేస్తున్నారని వివరించాను. ఆసమయంలో వారు పేదవారని తెలిసి కూడా 1700 మంది కార్మికులను ఒకే ఒక సంతకంతో తీసివేశారు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్. నా రాజ్యంలో సంఘాలకు, సమ్మెలకు ఆస్కారం లేదని ఆగ్రహించారు. ఆ సమయంలో నేను ఆయనతో వాదించిప్పుడు నువ్వు ఇలాంటి వాటికి అడ్డం రావద్దన్నాడు కేసీఆర్. కానీ నేను వారు ధర్నా చేసే ప్రదేశానికి వెళ్లి సంఘీభావం తెలియజేశా ను. అణచివేతకు గురయ్యే వారికి, ఆకలితో అలమటించేవాడికి, పేదలకు, లేనివాళ్లకు సంఘం ఉండాల్సిందే అని నేను పేపర్లలో కూడా స్టేట్‌మెంట్ ఇచ్చాను. ఆశా వర్కర్లకు, గ్రామ కార్యదర్శులకు, ఆర్టీసీ సంఘాలకు నేను సంఘీభావం తెలియజేశాను. అధికారంలో ఉన్నా, లేకున్నా వారి కోసం కొట్లాడే వాడిని, పదవుల కోసం పెదవులు మూసుకుని కూర్చునే పద్ధతి నాది కాదు జీఎస్టీ పే సంఖ్యను పెంచండి, ఎక్కువ మంది కట్టడం వల్ల ట్యాక్స్ ఎక్కువ వస్తుంది కానీ, తక్కువ మంది ఎక్కువ ట్యాక్స్ కట్టడం వలన లాభం లేదని నాడే నేను వాదించా అని అన్నారు. దేశ సంపద, దేశంలోనే ఉండే విధానం అమలులోకి వచ్చింది, గత ప్రభుత్వాల కాలంలో నల్లధనం విదేశాలకు తరలి పోయేది, నేడు ప్రతీ ఒక్కరూ సోషల్ మీడియా ద్వారా ప్రపంచంలో ఏం జరుగుతోందో తెలుసుకోగలుగుతున్నారు. సంపాదించిన మొత్తంలో ఐటీ వారికి ఇన్‌కమ్‌టాక్స్ తగ్గించే విధానం ఉందా అని అడుగుతున్నారు. వీరి డిమాండ్‌కు నేను సానుకూలంగా స్పందిస్తానని మాట ఇస్తున్నాను. దేశవ్యాప్తంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని మళ్లీ డిమాండులు వస్తున్నాయి. రాబోయే పార్లమెంట్ ఎన్నికల విషయంలో సామాన్య ప్రజలకు చక్కటి అవగాహన ఉంది, మోదీ గ్రామీణ ప్రాంతాలలో కూడా మౌలిక వసతులు ఎంతగానో అభివృద్ధి చేశారని, స్వచ్ఛ భారత్ ద్వారా 12 కోట్ల ఇళ్లలో టాయిలెట్స్ కట్టించారని అన్నారు. నరేంద్ర మోడీ గత పదేళ్ల కాలంలో 3 మాత్రమే ఉన్న ఎయిమ్స్ ఆసుపత్రులు నేడు దేశంలో 19కి పెరిగాయి. రోడ్లు, రైల్వేలు, ఎయిర్ పోర్టులు, ఎంతగానో అభివృద్ధి చెందుతున్నాయి. మహిళలకు 2,500 రూపాయలు నెలకు ఇస్తామని, చదువుకునే ఆడ పిల్లలకు స్కూటీలు కొనిస్తామని, వికలాంగులకు, వృద్ధులకు పెన్షన్ మొత్తాలు పెంచుతామని హామీ ఇచ్చారు. కానీ వీటన్నింటికీ కావలసిన డబ్బు ఎక్కడ నుండి తెస్తారని ఎద్దేవ చేశారు. ప్రధాని మోదీ ఎన్నడూ ఇలాంటి అబద్ధపు హామీలను ఇవ్వలేదని, గొప్ప రాజ్యంగా పేరు పొందిన రష్యా కూడా ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో ప్రధాని మోదీ సలహా, సంప్రదింపులు, రాయబారాన్ని కోరుకుంటోంది. ఒకప్పుడు అగ్రరాజ్యాల లిస్టులో కేవలం అమెరికా, రష్యా, బ్రిటన్ లాంటి అగ్రరాజ్యాలే ఉండేవి. కానీ నేడు బ్రిటన్‌ను కూడా అధిగమించి గొప్ప ఆర్థిక వ్యవస్థగా భారతదేశము ఎదిగిందని అన్నారు. మన మల్కాజ్ గిరి పార్లమెంట్ పరిధిలోని ఎలాంటి సమస్యలైనా నేరుగా ప్రధానిమోదీ వద్దకు పోయి చర్చించగలిగే సత్తా ఉన్న వ్యక్తిని నేను అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దురదృష్టవశాత్తూ ఎలక్షన్ ఓరియంటెడ్ ప్రమాణాలు చేస్తున్నారు. మన జీతానికి తగినట్లే ఖర్చులు ఉన్నట్లే, రాష్ట్ర బడ్జెట్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు హామీలు ఇవ్వాలి, కానీ వారు ఆదాయానికి మించిన అబద్ధపు హామీలు ఇస్తున్నారని మండిపడ్డారు. ఈ మధ్య జరిగిన జీ-20 సమావేశాలలో భారత్‌కు లభించిన గౌరవం మీకు తెలిసిందే, కరోనా కాలంలో ప్రధాని మోదీ ప్రజలకు వ్యాక్సిన్ మాత్రమే కాదు, విలువ కట్టలేని ధైర్యాన్నిచ్చారని తెలిపారు. జీఎస్టీ విధానంలో నేడు దేశ ఆర్థిక వ్యవస్థ ఎంతో అభివృద్ధి చెందిందని, దీనిద్వారా నల్లధనం ఎంతో అరికట్టబడిందని తెలిపారు. నేడు విదేశీ మారక నిల్వలు రెండింతలు అయ్యాయి, దేశ అభివృద్ధి కోసం, శాంతి భద్రతల పరిరక్షణ కోసం, ప్రపంచంలో మన దేశ ఆత్మగౌరవం నిలబడాలంటే తప్పకుండా మళ్లీ ప్రధాని మోదీనే ప్రధానిని చేయాలని ప్రజలందరూ దృఢ నిశ్చయానికి వచ్చారని అన్నారు. భారతదేశంలో మరెక్కడా లేని సేవింగ్స్ విధానం ఉంది, కరోనా సమయంలో అదే మనలని కాపాడిందని, పొదుపును పాటిస్తూ, ఇంత గడ్డు కాలంలో కూడా 11 వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత దేశం నేడు ఐదవ స్థానానికి వచ్చిందంటే అది మోడీ కృషి అని అన్నారు. మరోసారి ప్రధాని మోదీని గెలిపిస్తే 3 వస్థానానికి చేరుతుందనడంలో ఎలాంటి సందేహం లేదని, అందుకే మీలాంటి వారంతా మళ్ళీ మోడీని ప్రధానిని చేసేందుకు నన్ను మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈటల నవనీత్, వడ్డేపల్లి రాజేశ్వరరావు, సంతోష్ సహా పెద్దఎత్తున ఐటి ఉద్యోగులు హాజరయ్యారు.



## ఫతేనగర్‌లో బిఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

### ప్రజల నుండి విశేష స్పందన... పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం): మల్కాజ్ గిరి పార్లమెంట్ పరిధి లోని కూకట్ పల్లి నియోజకవర్గ0, ఫతేనగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ లో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ ప్రతిపాదించి బలపరిచిన అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కి మద్దతుగా వారి కుమార్తె మౌనిక రెడ్డి, ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ గౌతమ్ నగర్ లో ఇంటింటా తిరిగి అభ్యర్థి రాగిరి లక్ష్మారెడ్డి కారు గుర్తుకు ఓటు వేసి రాష్ట్రంలోనూ అటు కేంద్రంలోనూ బలమైన ప్రశ్నించే గొంతుగా అవకాశం ఇవ్వాలని అభ్యర్థిని బలపరిచి కారు గుర్తుకు ఓటేయాలని ప్రతి ఒక్కరిని అభ్యర్థించారు. ప్రజల నుండి కూడా విశేష స్పందన లభిస్తుందని, ప్రజలు కాంగ్రెస్ పరిపాలన చూశాక కచ్చితంగా ఈ ఐదేళ్లపాటు కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ప్రజలు రక్షించబడాలంటే ప్రశ్నించే గొంతుకగా బిఆర్ఎస్ పార్టీకి గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కారు గుర్తుకొట్టేస్తామని ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కుతాటి రాములు, డివిజన్ అధ్యక్షులు బిక్షపతి, డివిజన్ జనరల్ సెక్రెటరీ సుదర్శన్ రెడ్డి, నసీర్, నషా, శిల్ప, ఉమావతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.



## చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్ రెడ్డి గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### తండ్రి గెలుపు కోసం తనయుడు ఇంటింటి ప్రచారం

కూకట్‌పల్లి, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం): చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల నేపథ్యం లో చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి కి మద్దతుగా కుమారుడు రాజ్ ఆర్యన్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వర రావు ఇంటింటి ప్రచారం పాదయాత్ర లో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం, కూకట్ పల్లి 121 డివిజన్ లోని దీనబంధు కాలనీ, ప్రగతినగర్, పాపిరెడ్డి నగర్ లలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్ ఆర్యన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుండి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్తూ వందరోజుల కాలంలోనే ఐదు గ్యారంటీలను అమలుపరిచి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని, మాటలు చెప్పే ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్ రెడ్డి కోసం ప్రతి ఒక్కరు కృషి చేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



## కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు పని చేయాలి

### కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరిక... కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించిన బండి రమేష్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చూసి పార్టీ పట్ల ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కూకట్ పల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రమేష్ అన్నారు. శనివారం బాలానగర్ పార్టీ కార్యాలయంలో కోఆర్డినేటర్ కోటంరెడ్డి వినయ్ రెడ్డి సమక్షంలో పెద్ద ఎత్తున వివిధ పార్టీలకు చెందిన ఫతేనగర్ డివిజన్ కార్యకర్తలు చంద్ర శేఖర్, శైలు యాదవ్ శ్రీనివాస్, కుమార్ గౌడ్, సాయిరాం మరియు ముఖ్యమైన నాయకులు కాంగ్రెస్ పార్టీ పార్టీ తీర్థం పుచుకున్నారు. వీరిని బండి రమేష్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాలని పార్టీ విజయానికి కృషి చేయాలని రమేష్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి సత్యం శ్రీరంగం, ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, బ్లాక్ అధ్యక్షులు రమేష్, బాకీ, మాధురి రాము, దండు యాదగిరి, కూకట్పల్లి మున్సిపల్ ఎక్స్ వైస్ చైర్మన్ లక్ష్మణ్, ఇజాజ్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన ఉప్పల్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే

### కండువాను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన ఈటల రాజేందర్...



కూకట్‌పల్లి, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం) కే పీ హెచ్ బి డివిజన్ లోని మంజీర ట్రినిటీ హోమ్స్ లో ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ తో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అపార్ట్మెంట్ సభ్యులతో ముచ్చటించారు. వారి మద్దతు తమకు ఇవ్వాలని కోరగా వారు సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎంబీసీ ఎక్స్ చైర్మన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వడ్డేపల్లి రాజేశ్వర్ రావు, ఈటల రాజేందర్ గార్ల సమక్షంలో ఆర్.పీ.ఐ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే పుష్పలత గౌడ్, విశ్వకర్మ సభ్యులు స్వప్న, ధర్మేంద్ర చారీ బీజేపీలో చేరారు. వారిని ఈటల రాజేందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



కొత్త కోట పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## కొత్తకోట మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్న 14 వార్డు ప్రజలు

కొత్త కోట, ఏప్రిల్ 27(ప్రభాత ఉదయం): పాలమూరు పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి చెల్లా వంశీచంద్ రెడ్డి చేతి గుర్తుకు ఓటు వేయాలని పట్టణ కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి ప్రచారాలు నిర్వహించారు. దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం ఇంటింటి ప్రచారం కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి మేస్త్రి శ్రీనన్న, కొమ్ము క్రాంతికుమార్, ఆధ్వర్యంలో 14 వ. వార్డు లో ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది ఈ ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యాక్షులు పల్లెపాగు ప్రశాంత్, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శలు ఎన్ జె బోయజ్, పి. కృష్ణ రెడ్డి, మాజీ జెడ్ పి టి సి బాబు,ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, జెసిబి రాములు, గొల్ల బాబన్న,సలీం ఖాన్, మాజీ డైరెక్టర్ పి నరేందర్ సాగర్ ,కొత్తకోట మున్సిపల్ కోఅప్షన్ సభ్యులు జె ఎం. మీషేక్, మాజీ కోఅప్షన్ లతీఫ్ బాయ్, కొత్తకోట మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ పి రాంమోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంజీవుడు ,మాజీ డైరెక్టర్ సి. యాదయ్య సాగర్,పి మోహన్ రెడ్డి,సంద వెంకటేష్,,ముజీబ్, తయాబ్ , ఆర్.లక్ష్మయ్య బాబాయ్ ,డబ్బు లక్ష్మయ్య,వళుగుమన్ శ్యామ్, కరాటే శ్రీను, జెకె. రాజు, కదిరే సాయిలు యాదవ్,మాజీ వార్డ్ మెంబర్ పెంటన్న యాదవ్, ఎన్.నాగభూషణం , ఎన్ ఎస్ యు ఐ ముస్తఫా, జి.భాస్కర్ యాదవ్,పూసులూరు భాస్కర్, సాయిలు యాదవ్,షేకిల్,శాంతి రెడ్డి,శివ రెడ్డి,రాములు యాదవ్, డోలు మన్యం యాదవ్, ప్రవీణ్ యాదవ్, రాజేష్ యాదవ్,జనార్దన్ రెడ్డి, దిలీప్ రెడ్డి, జి సాయిరాం, ఎం బాలరాజ్ యాదవ్, జె.కృష్ణయ్య,ఎన్.శాంతిరాజ్ , జె.కురుపన్న,ఎన్.సాయిలు,కొమ్ము సుజ్ఞానం,ఎస్. బాబు, జె జాన్,ఎం. అంజన్న యాదవ్, టౌన్ మైనారిటీ అధ్యక్షులు ఈజాజ్ అలీ, టౌన్ ఉపాధ్యక్షుడు కైసర్, సయ్యద్ లాల్,ఎం భాస్కర్,అలీమ్, ఖలీల్, షాలీ,హర్షవర్ధన్ రెడ్డి, మతిన్, బాలు,ప్రవీణ్ కుమార్ , జె. నాగరాజు,బి సంజీవరావు,కొత్వాల్ చోటు , డి.శ్రీకాంత్, కె గోపి,మహేష్, అభిద్, మౌలానా,జె. కర్ణ కుమార్,ఎన్.ప్రసన్న, నవీన్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ నవీన్ కుమార్ ,బాలకృష్ణ,కార్తీక్, జె విక్రమ్,దితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్పొరేటర్ బిజెపిలోకి!

### బిజెపి చీఫ్ సమక్షంలో బిజెపిలో చేరనున్న రావుల శేషగిరిరావు కుత్బుల్లాపూర్ బిజెపికి బలం చేకూరే అవకాశం



కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 27(ప్రభాత ఉదయం): సీనియర్ కార్పొరేటర్(గాజుల రామారం) రావుల శేషగిరిరావు బిజెపిలో చేరనున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్‌లో జరిగే బిజెపి ఎన్నికల బహిరంగ సభలో భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో బిజెపిలో చేరనున్నారు. రావుల శేషగిరిరావు ఒక పర్యాయం కౌన్సిలర్ గా, మూడు పర్యాయలు కార్పొరేటర్ గా గెలుపొంది ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ఇటీవల భారత రాష్ట్ర సమితి అధికారం కోల్పోవడం ఆ పార్టీ భవిష్యత్తు ప్రశ్నార్థకం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు నేతలు ఇతర పార్టీలలో చేరుతున్నారు. అదే కోవలో గాజుల రామారం కార్పొరేటర్ రావుల శేషగిరిరావు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రజా ఆకర్షణ పరిపాలన కు ఆకర్షితులై బిజెపిలో చేరాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ఏప్రిల్ 29 సాయంత్రం నాలుగు గంటలకు గాజుల రామారం డివిజన్ మహారాజ్ గార్డెన్ నుండీ తన అనుచరులతో కార్యకర్తల తో తరలి వెళ్లి నిజాంపేట్ కార్పొరేషన్ హనుమాన్ దేవాలయం వద్ద జరిగే బహిరంగ సభలో భారతీయ జనతా పార్టీ లో చేరనున్నారు.




## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పట్నం సునీత మహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేద్దాం

### నియోజకవర్గ కో ఆర్డినేటర్ కోటింరెడ్డి వినయ్ రెడ్డి పట్నం సునీత మహేందర్ రెడ్డికి కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీ ఓట్లు వేయించాలి... టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పార్టీ ప్రచార కార్యాచరణ పై టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కూకట్ పల్లి నియోజకవర్గ కో ఆర్డినేటర్ కోటింరెడ్డి వినయ్ రెడ్డి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్ప రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కోటింరెడ్డి వినయ్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేద్దామని అన్నారు. ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ రోజు వారీగా చేపట్టాల్సిన ఎన్నికల ప్రచారాలు అనుసరించాల్సిన విధానాలపై సమీక్షించి, కాంగ్రెస్ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పట్నం సునీత మహేందర్ రెడ్డి కి కూకట్ పల్లి నియోజకవర్గం నుంచి మనందరం మరింత కృషి చేసి అత్యధిక మెజారిటీ ఓట్లు వేయించాలని అన్నారు. మల్కాజ్ గిరి పార్లమెంటు స్థానంలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడ్ల మోహన్ రెడ్డి, మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మధు గౌడ్, ఆకుల నరేందర్, కొన్నింటి శామ్యూల్, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, బంధిగ బాలనర్సింహా, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ శేఖర్ గజానంద్, తిరుపతయ్య, మహేందర్, జల్లా శివ, ఇమ్ము, భరత్, నరేష్, సత్యం, యుగంధర్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సామ ఇంద్రపాల్ రెడ్డి

బుద్వేల్, ఏప్రిల్27(ప్రభాత ఉదయం): రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఉప్పర్ పల్లికి చెందిన సామ ఇంద్రపాల్ రెడ్డి శనివారం తెలంగాణ శాసనసభ అధిపతి గడ్డం ప్రసాద్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన తనకు సహకరించాలని కోరారు. అందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పందిస్తూ యువకుడు, ఉత్సాహం ఉన్న నాయకుడు ఇంద్రపాల్ రెడ్డి కాంగ్రెస్ లోకి రావడం సంతోషకరమన్నారు.



స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను కలసిన సామ ఇంద్రపాల్ రెడ్డి



## చేవెళ్ల బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి గెలుపు కోసం అత్తాపూర్ డివిజన్లో ఇంటింటికి ప్రచారం

రాజేంద్రనగర్, ఏప్రిల్ 27(ప్రభాత ఉదయం) చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఎం సంగీత గౌరీ శంకర్ అన్నారు. శనివారం అత్తాపూర్ డివిజన్ పరిధిలో ని హైదర్గూడ లో శనివారం ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది . ఈ సందర్భంగా కార్పొరేటర్ సంగీత మాట్లాడుతూ .. నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు వివరిస్తూ బిజెపికి ఓటు వేయాలని ఆమె పార్టీ శ్రేణులు కలిసి కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి అత్తాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ , ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సులి గే వెంకటేష్, జయాన%శీ%ద్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కొమురయ్య, సిద్ధేశ్వర్ రాజు, వెంకట్ రెడ్డి, జగన్ ,శశికాంత్ శర్మ, ముఖేష్, బీరధర్ ,నరేష్ ,ఉమా గాయత్రి, శ్యామ్, శ్రీకాంత్ చారి భరత్ రాము శేఖర్ శివ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.